# భావప్రకటనా స్వేచ్ఛ- హిందూత్వ ఆచరణ

గొౖరెపాటి మాధవరావు
మానవ హక్కుల కార్యకర్త

మనిషి మిగతా జంతు ప్రపంచం నుంచి విడివడే పరిణామ ప్రక్రియలో చేతుల తర్వాత కీలకపాత్ర నోటిదే. అరుపులతో, సంజ్ఞలతో తాను ఏమి ఆలోచిస్తున్నదో తన సహచరులకు చెప్పింది ఆది మానవి; సమూహాలకు మార్గదర్శిగా ముందుండి నడిపింది. అరుపులే మాటలయ్యాయి. సంజ్ఞలే చిత్రలిపిగా, అక్షరమాలగా మారాయి. దాంతో అస్పష్టతలు, అర్థం చేయించలేక పోవడాలు ఆగిపోయాయి. స్పష్టమైన ఉచ్ఛారణ, రాత మొదలయ్యాయి. సమూహాలు కుటుంబాలయ్యాయి. కుటుంబాలు సమాజాలయ్యాయి. సమాజాలలో ఆధిపత్యాలు గద్దెనెక్కాయి. రాజ్యాలయ్యాయి. రాజ్యానికి తెలిసింది ఆజ్ఞాపించడమే. పాలితులను మాట్లాడనీకుండా రాజ్యంఅధికారం ఆంక్షలు పెట్టింది. స్వేచ్ఛగా బ్రతికిన మనిషికి ఈ కొత్త పరిస్థితితో సర్దుబాటు చేసుకోవడం ఇబ్బందిగానే అన్పించి ఉంటుంది. మనుషులం ఒకరి కొకరం సంభాషించుకోకపోతే ఎలా? కష్టసుఖాలు చెప్పుకోక పోతే ఎలా? రాజుకు ఇన్ని అధికారాలా? రకరకాల పనులు చేసి, పన్నులు కట్టి రాజ్యం మనుగడకే కీలకమైన సామాన్యుడిపై ఇన్ని ఆంక్షలా? మాట్లాడే హక్కు రాజ్యం ఇచ్చిందా? కాదే. అది పుట్టుకతోనే సంక్రమించింది. అధికారం నాకున్న హక్కును నాకు కాకుండా చేస్తోంది. ప్రజాస్వామ్యమూ, ప్రాతినిధ్య ప్రభుత్వాలు వచ్చి కూడా ఈ హక్కుపై ఆంక్షలు పెట్టడమేమిటి?,అని మనిషి మదన పడకుండా ఉండి ఉండదు. ప్రభుత్వాలు ప్రజల హక్కులను ఒక్కొక్కటిగా హరిస్తున్నా ఎవరూ ఏమీ మాట్లాడలేక పోయారు. కారణం? మాట్లాడడం మీద ఆంక్షలు. పర్యవసానం? అడిగేవారు, అడ్డుకునే వారు లేక పోవడంతో నియంతృత్వ పద ఘట్టనల కింద ప్రపంచం అల్లాడిపోయింది. రెండు ప్రపంచయుద్ధాలను చూసిన మానవాళి ఇలాంటి ఉపద్రవాలు మున్ముందు రాకుండా ఉండాలంటే అన్ని దేశాలు మానవ హక్కులను గౌరవించాలని అభిప్రాయపడింది. ఫలితం. మానవహక్కుల విశ్వ ప్రకటన.దీన్ని 1948 డిసెంబర్ 10 న ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రతి ఒక్కరికి అభిప్రాయ, భాప్రకటన స్వేచ్ఛలున్నాయి. అంటే పరుల జోక్యం లేకుండా అభిప్రాయాలను కలిగి ఉండే హక్కు, ఏ మాధ్యమం ద్వారానైనా దేశహద్దులతో సంబంధం లేకుండా సమాచారాన్ని, భావాలను అన్వేషించడానికి, పొందడానికి, బోధించడానికి, ప్రచారం చేయడానికి హక్కు ఉంది" అని మానవ హక్కుల విశ్వప్రకటనలోని 19వ అధికరణం ప్రకటించింది. అభిప్రాయాలను కలిగి ఉండే స్వేచ్ఛను, వాటిని వ్యక్తీకరించుకునే స్వేచ్ఛనూ మనిషి పుట్టుకతోనే పొందడమే కాదు ఆ స్వేచ్ఛలకు ప్రాథమిక స్వేచ్ఛలుగా రాజ్యాంగ గుర్తింపును కూడా పొందాడు. మానవ హక్కుల విశ్వప్రకటనలోని 19వ అధికరణంలో నిక్షిప్తం చేసిన హక్కునే భారత రాజ్యాంగంలోని 19వ అధికరణం కూడా ప్రకటిస్తుంది. ప్రతి భారత పౌరుడికి అభిప్రాయాలను కలిగి ఉండే స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ ఉన్నాయని ఆ అధికరణం అంటుంది.

తన ఆలోచనలను, అనుభూతులనూ మాటలతోనే వ్యక్తీకరిస్తాడు మనిషి. మనిషికి పుట్టుకతో సంక్రమించిన హక్కు గనుక ఇది సహజ హక్కు మాత్రమే కాదు ఇది మౌలిక హక్కు. మనిషి మేధస్సు నిరంతరం పరిసరాలను పరిశీలిస్తుంది. ఆ పరిశీలనలో వచ్చే పలు సందేహాలకు జవాబులను అన్వేషిస్తుంది. ఆ అన్వేషణే పరిశోధన. భావ ప్రకటన హక్కు మనిషిని సత్యాన్వేషణకు పురి కొల్పుతుంది. తన పరిశోధనా ఫలితాన్ని మనిషి ఎప్పుడూ తనలోనే ఉంచుకోడు, దాన్ని లోకానికి వెల్లడించాలనుకుంటాడు. ఆ అభిప్రాయాన్ని ప్రకటించినప్పుడు మాత్రమే ఆ వ్యక్తి నిండుదనాన్ని అనుభవిస్తాడు.

ఒక అంశంమీద విధాన నిర్ణయం చేయాల్సినప్పుడు నిర్ణయీకరణ ప్రక్రియలో పాల్గొనాలంటే భావ ప్రకటనా స్వేచ్ఛ ఉంటేనే సాధ్యం. మరోమాటలో చెప్పాలంటే భావ ప్రకటనా హక్కు నిర్ణయీకరణలో పాల్గొనే శక్తిని బలోపేతం చేస్తుంది. భావాన్ని ప్రకటించాలంటే ముందుగా భావం ఏర్పర్చుకోవాలి. భావం ఏర్పర్చుకోవాలంటే అందుకవసరమైన సమాచారం ఉండాలి. సమాచారం పొందే హక్కు ఉండాలి. అందుకే భావప్రకటనా హక్కు అంటే సమాచారాన్ని పొందే హక్కు.

ప్రతి జ్ఞానేంద్రియం ద్వారా, ప్రతి అవయవం ద్వారా అనుభవించే జీవితమే నిండైన జీవితం. వీటిల్లో దేన్ని ధ్వంసం చేసినా, నష్టపరిచినా, వాడనీయకపోయినా, అది జీవించే హక్కును ఆ మేరకు హరించినట్లే. మెదడు చేసే పని ఆలోచించడం. నాలుక పని మాట్లాడటం!. స్వరపేటిక పని ధ్వనిని సృష్టించడం. రాత చేతిపని. వీటిలో ఏ అవయవంతో పని చేయనీయక పోయినా అప్పుడు మనిషి మనిషిగా కాక జంతువు స్థాయికి కుదించుకు పోతాడు. జంతువు కేవలం ఉనికిలో ఉంటుంది.. కాని మనిషి జీజీవించాలి.. ఆలోచించే అవకాశం, అనుభూతించే, స్పందించే హృదయం, ఆ స్పందనలను వ్యక్తీకరించగలిగే అవకాశం–ఇవన్నీ ఉన్నప్పుడే అది మానవ జీవనం. ఇవన్నీ ఉంటేనే కదా నిండుదనం వచ్చేది జీవితానికి. జీవించడం అంటే అర్థం ఇదే. అందుకే భావ ప్రకటనా స్వేచ్ఛ జీవించే హక్కులో అంతర్భాగం. అవును భావ ప్రకటనా స్వేచ్ఛకు ఇంత విశాల అర్థం ఉంది.

ఇంతలోతైన, విశాల అర్థంగల భావప్రకటనా స్వేచ్ఛను రాజ్యాంగంలో చేర్చేటప్పుడు రసవత్తర చర్చే జరిగింది. "సావిత్రీ ఏ వరమునైనను కోరుకొనుము.... ఇచ్చెద... అదియును నీ పతిప్రాణంబు దప్ప" అంటాడు యముడు. "19వ అధికరణమందుగల ఏ స్వేచ్ఛనైనను అనుభవించవచ్చును.... అయితే పరిమితులకు లోబడి మాత్రమే" అంటుంది రాజ్యాంగం. ఆ పరిమితులను చూసి రాజ్యాంగ పరిషత్తులో సభ్యుడైన సోమనాథ్ లాహిరి 19 వ అధికరణాన్ని పోలీసు కానిస్టేబుల్ దృష్టితో రూపొందిస్తున్నారు అని, అప్పుడే అక్కడే అన్నాడు. ఆయన చెప్పిన మాటలను పట్టించుకోకపోతేఅమలు చేయకపోతే ఆయన బాధపడతాడనే అనుకున్నారో, లేక ఆయన జోస్యం నిజం కావాలని అనుకున్నారో కాని పోలీసులు మాత్రం భావ ప్రకటనా స్వేచ్ఛపై ఎన్ని రకాల ఆంక్షలు పెట్టగలరో, వ్యక్తులపై ఎన్ని కేసులు పెట్టగలరో అన్నీ పెట్టారు.పెడుతూనే ఉన్నారు

## భావప్రకటనా స్వేచ్ఛపై హిందూత్వ దాడులు...

మనుషుల ఆలోచనలమీద, వాటి వ్యక్తీకరణలమీద ప్రభుత్వాలు ఆంక్షలు విధించడం ఒక ఎత్తయితే హిందూత్వ వాదులు భౌతికదాడులకు పాల్పడటం మరో ఎత్తు. మొదట వాళ్లు చరిత్రగ్రంథాలపై పడ్డారు. జాతీయ విద్యా పరిశోధనా, శిక్షణా సంస్థ (ఎన్‌సిఇఆర్‌టి) విద్యార్థుల కోసం ప్రచురించిన, ప్రాచీన, మధ్యయుగ భారత చరిత్ర పుస్తకాలను నిషేధించాలని, కనీసం మార్కెట్ నుంచి ఉపసంహరించాలని పట్టుబట్టారు. కారణం అతి చిన్నది– చరిత్రను హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు చెందిన రాజవంశాల చరిత్రగా బోధించాలని వాళ్ల అభిమతం. ఉత్పత్తి విధానంలో చోటు చేసుకునే పరిణామాలతో చరిత్ర పురోగమిస్తుందనేది శాస్త్రీయ సత్యం కాబట్టి, ఆ సత్యాన్నే పిల్లలకు నేర్పాలనేది ఎన్‌సిఇఆర్‌టి వాదన. అది రాయించిన పాఠ్య పుస్తకాల్లో ఆ విషయమే ఉంది. చరిత్రను మతతత్వంతో బోధిస్తే ఆది అనర్థాలకు దారి తీస్తుందనీ, శాస్త్రీయ బోధన పరిశోధనను ప్రోత్సహిస్తుందని ఆ సంస్థ అభిప్రాయం. సంఘ పరివార్ చేసిన ప్రయత్నాలకు గట్టి ప్రతిఘటనే ఎదురయ్యింది.

ఇట్లయితే పని నడవదనుకున్నారు. ప్రచురణ కర్తలను బెదిరించడం మొదలు పెట్టారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచినది పెంగ్విన్ ప్రచురణ సంస్థ. అది 'ది హిందూస్' అనే పుస్తకాన్ని ప్రచురించింది. రచయిత వెండి డోనీగర్. పదుల సంవత్సరాల పాటు ఆమె చేసిన పరిశోధనా ఫలితం ఆ పుస్తకం. సంఘ్ పరివార్ బెదిరింపులకు లొంగి ప్రచురణ కర్తలే ఆ పుస్తకం అమ్మకాలను ఆపేశారు. 'శివాజీ, హిందూ కింగ్ ఇన్ ఇస్లామిక్ ఇండియా' పుస్తకాన్ని పంపిణీ చేయవద్దని భండార్‌కర్ పరిశోధనా కేంద్రంపై పడి అక్కడ విధ్వంసకాండకు పాల్పడ్డారు. ఎ.కె.రామానుజన్ గొప్ప పండితుడు, పరిశోధకుడు. వివిధ దేశాలలో గల రామాయణాలపై ఆయనో పరిశోధక వ్యాసం రాశాడు. ఢిల్లీ విశ్వవిద్యాలయం చరిత్ర విద్యార్థులకు దాన్ని పాఠ్యాంశంగా నిర్ణయించింది. దాన్ని తొలగించమని సంఘ్‌పరివార్ ఒత్తిడి చేయడమే కాక చరిత్ర శాఖ భవనంపై దాడి చేసి కిష్కిందను ఆవిష్కరించారు.

సంఘ్‌పరివార్ కాదుకాని దాదాపు అలాంటి వారేకొందరు తమిళ రచయిత పెరుమాళ్ మురుగన్ రాసిన "అర్థనారి" నవలను ఉపసంహరించాలని ఆర్డీవోస్థాయి అధికారి నేతృత్వంలో చెట్టుకింద పంచాయతీ నిర్వహిచారు. దాన్ని నిషేధించాలని కొందరు కోర్టుకెక్కారు. పంచాయతీనిర్ణయంతో వ్యథ చెందిన పెరుమాళ్ మురుగన్ రచయితగా తాను చనిపోయినట్లుగా ప్రకటించాడు. అతని పుస్తకం స్థానిక సెంటిమెంట్‌లకు విరుద్ధంగా ఉందని నిషేధాన్ని కోరుతున్న వారు కోర్టులో వాదించారు. 'ఇష్టం లేక పోతే పుస్తకం చదవకండి. అంతేకాని నిషేధించమని అడిగే హక్కు మీకు లేదు' అని మద్రాస్ హై కోర్టు తీర్పు చెప్పింది. 'కాలాన్ని బట్టి అభిరుచులు మారుతాయి. లోగడ ఏవగింపుకు గురయినది, నేడు ఉత్కృష్ట రచన కావచ్చు' అని "లేడీ చాటర్లీస్ లవర్ " నవలను ఉదహరణగా పేర్కొంది. తెలుగు జడ్జీ అయితే ముద్దుపళని రాసిన 'రాధికా సాంత్వనం' ని పేర్కొని ఉండేవారేమో!. లేడీ చాటర్లీస్

లవర్, రాధికా  సాంత్వనం ఒకసారి నిషేధానికి గురయిన గ్రంథాలు. మద్రాస్ హై కోర్టు   పెరుమాళ్ మురుగన్‌ను పునరుజ్జీవింపజేసింది. నీ పని రాయడమే. రాయి అంది.      ప్రతిఘటన గెలిచింది... వేదిక న్యాయస్థానం కాబట్టి.

భావ ప్రకటనా స్వేచ్ఛను సంఘ్‌పరివార్ ఎన్నడూ గౌరవించలేదు. మొదట చరిత్ర పుస్తకాలపై ఒత్తిడి తెచ్చింది. తర్వాత వానరమూకలా చెలరేగిపోయింది. ధ్వంసరచనకు పాల్పడింది. అవన్నీ పాతపద్ధతులు అనుకున్నారో ఏమో, ఆలోచించే తలల్లోకి, స్పందించే గుండెల్లోకి తూటాలను దింపడం వారి కొత్త ఆచరణ.

గౌరీ లంకేశ్‌ను ఎవరు చంపారు?. వ్యక్తులెవరో ఒక్కొక్కరూ బయటపడుతున్నారు సంపూర్ణ దర్యాప్తు సాధ్యమో కాదో? ఇంకా బయట పడలే. దర్యాప్తు సంస్థలు బయట పెట్టగలవో లేదో కూడా సందేహమే. కాని ‘ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా ఆ రాతలు రాసి ఉండకపోతే ఆమె బ్రతికి ఉండేది’ అని శృంగేరి ఎమ్మెల్యే జీవరాజ్ అన్నారు. అదీ సెప్టెంబర్-7న. అంటే హత్య జరిగిన రెండు రోజులకే. ఆయనగారు బీజేపి ఎమ్మెల్యే! గౌరీ లంకేశ్ నిజాయితీగా, మహాధైర్యంతో సంఘ్‌పరివార్ సిద్ధాంతాన్ని తన పత్రికలో ఎండగట్టేది. సంఘ్‌పరివార్ ఆగడాలపై తన కలంతో విరుచుకుపడేది. హేతుబద్ధంగా జవాబు చెప్పే పౌరుషం ఆ పురుష పుంగవులకు లేకుండాపోయింది. ఆమె ను 2017  సెప్టెంబర్-5న, బెంగళూరులో, తన ఇంటి ఆవరణలో తుపాకితో కాల్చి చంపారు.

**2017లో ధార్వాడలో తన ఇంట్లో ఉన్న విద్యావేత్త, పరిశోధకుడు, బహుగ్రంథకర్త అయిన ఎంఎం కల్బుర్గీని తుపాకితో కాల్చి చంపారు. చేసిన నేరం?. తనకున్న భావప్రకటనా స్వేచ్ఛను ఉపయోగించుకుని తన పరిశోధనలో తేలిన విషయాలను రాశాడు. శైవం హైందవంలో భాగం   కాదు అన్నాడు. లింగాయత్‌ను ప్రత్యేక మతంగా గుర్తించమని చేస్తున్న  ఆందోళనకు మద్దతు పలికాడు. ఇది హిందూత్వ వాదులకు కంటగింపు అయ్యింది . ఆయన కంఠాన్నే నులిమేశారు. అదే సంవత్సరం ఈ హంతక మూకలు గోవింద్ పన్సారేను మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో తుపాకీతో    కాల్చి చంపారు?. కారణం? ‘ హిందూ స్వరాజ్య భానుడు’ అని శివాజీని హిందూత్వ వాదులు చిత్రించడాన్ని తన పరిశోధనతో ఎదుర్కొన్నాడు.      హైందవ ధర్మంలో క్షత్రియుడే రాజు కావాలి కాని, శివాజీ శూద్రుడని  పన్సారే తేల్చాడు. శివాజీ పోరాడింది సామ్రాజ్య విస్తరణ వాదులకు వ్యతిరేకంగానే కాని, ముస్లిం లకు వ్యతిరేకంగా కాదని తేల్చాడు. తన సైన్యంలో అనేకమంది ముస్లింలకు ఉన్నత బాధ్యతలను అప్పగించాడు అని తేల్చాడు. గోవింద్ పన్సారే హేతువును ఎదుర్కొనే శక్తి హిందూత్వ వాదులకు లేదు. అంతే. హంతక మూకలను రంగంలోకి దింపారు. నరేంద్ర    దభోల్కర్ అనే మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడే ఆలోచనా పరుడిని కాల్చి చంపారు. కారణం? మూఢనమ్మకాల్లోంచి బయటపడిన వ్యక్తులు  ప్రశ్నను సంధిస్తారని భయం. ప్రశ్నకు సమాధానం చెప్పగలిగే శక్తి సంఘ్‌పరివార్‌కు లేదు. అందుకే హంతక ముఠాకు పని చెప్పారు. ఈ ఘటనల నుంచి స్ఫూర్తి పొందారో, ఏమో కాని రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ కంచె ఐలయ్య రాసిన పుస్తకాన్ని నిషేధించాలని**

సంఘ్‌పరివార్ అనుకూల శక్తులు గోల చేసాయి. పుస్తకాన్ని మార్కెట్‌లో నుంచి ఉపసంహరించక పోతే తననే సంహరించాల్సి ఉంటుందని ఆయన్ని భయపెట్టారు.

ఈ నలుగురిని చంపడానికి కారణం ఒక్కటే. ఈ నలుగురూ తమతమ రంగాలలో నిష్ణాతులు. పరిశోధకులు, లోతుగా ఆలోచిస్తారు. తమ ఆలోచనలను, అనుభూతులను, అద్భుతమైన విశ్లేషణతో ప్రజల ముందు పెడతారు. ప్రజాభిప్రాయాన్ని కూడగడతారు. హిందూత్వ రాజకీయాలను వ్యతిరేకిస్తారు. ప్రశ్నించడాన్ని ప్రోత్సహిస్తారు . నమ్మకాల్లోని డొల్లతనాన్ని ఎండగడతారు. ఏ హేతువుకూ చిక్కని నమ్మకాలను ప్రజల్లో వ్యాపింపజేస్తూ ప్రజల మెదళ్లను మొద్దుబారుస్తూ, ప్రజలు ఆలోచిస్తే, ప్రశ్నిస్తే తమ ఉనికే ప్రశ్నార్థకమై పోతుందని నిత్యమూ భయపడేవారే ఈ హంతక రాజకీయాలకు పాల్పడేది. ఈ హత్యల్లో ఏ ఒక్కదాన్నీ మోడీ ఖండించలే. మాటలను చాలా పొదుపుగా వాడే వ్యక్తేమి కాదు మోడీ. పరిశోధకులు తమ మనసుల్లోని మాటలు మాట్లాడటానికి మోడీ నమ్మే భావజాలం అవకాశం ఇవ్వదు కాని తాను మాత్రం 'మన్ కీ బాత్' అంటూ దృశ్య శ్రవణ మాధ్యమాలను వాడుకుంటాడు. పేరు ప్రసార భారతేకాని ఆచరణలో అది ప్రచార భారతి. అందుకే ముందే రికార్డు చేసుకున్న త్రిపుర ముఖ్యమంత్రి మణిక్ సర్కార్ పంద్రాగస్టు ఉపన్యాసాన్ని రేడియోలో ప్రసారం కానివ్వలే సెంట్రల్ సర్కారోల్లు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రే తమ భావాన్ని ప్రకటించుకునే స్వేచ్ఛను కోల్పోయాడు. ఆ ఉపన్యాసం పోలీసులకు నచ్చలేదట. యూ ఆర్ రైట్ సోమనాథ్ లాహిరీ జీ. !!!!!

## తీవ్ర ప్రతిఘటన...

2016 సెప్టెంబర్ 9, వేదిక ఢిల్లీలోని జవహార్ లాల్ నెహ్రూయూనివర్సిటీ. సాయం సమయం. యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకులు అక్కడ ఉన్నారు. వారు ఎన్నికల్లో ప్రజాస్వామ్యయుతంగా గెలిచిన వారే. అఫ్జల్‌గురు ఉరిదీతను ఆ సమావేశం ఖండించింది. స్వేచ్ఛ కోసం నినదించారు అక్కడ సమావేశమైన విద్యార్థులు. విద్యార్థి సంఘం అధ్యక్షుడు కన్హయ్యకుమార్ 'భూస్వామ్యం నుంచి' అనగానే వందల గొంతులు ' స్వేచ్ఛ' అని బదులిచ్చాయి. అలా అలా 'పెట్టుబడిదారి విధానం నుంచి – స్వేచ్ఛ, సామ్రాజ్యవాదం నుంచి–స్వేచ్ఛ, కులవాదం నుంచి–స్వేచ్ఛ, మనువాదం నుంచి–స్వేచ్ఛ, బ్రాహ్మణవాదం నుంచి–స్వేచ్ఛ, ఆకలి నుంచి– స్వేచ్ఛ. ఈ నినాదాలు ఏలికలకు కంపరమెత్తించాయి. రాజద్రోహ నేరం ఆరోపించి ముగ్గురు విద్యార్థులను జైలుకు పంపారు పోలీసులు. 'ఆజాదీ' (స్వేచ్ఛ) అంటే స్వాతంత్రమే కదా వాళ్లు దేశాన్నుంచి స్వాతంత్ర్యాన్ని కోరుతున్నారు కదా అంటే దేశ ద్రోహమే అని 'ఆజాదీ' అంటే దేశద్రోహం కాకపోతే మరేమిటంటే దేశద్రోహమవుతుందో నాకు తెలీదు' అన్నాడు ఆనాడు కేంద్ర మంత్రివర్గంలో సీనియర్ మంత్రిగా ఉన్న వెంకయ్యనాయుడు. పైగా విద్యార్థులను జాతి వ్యతిరేకులు అన్నాడు.

అక్కడ మాట్లాడిన విద్యార్థులు ఎవరూ ఎవరూ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, హింసకు పాల్పడమని ఒక్కమాట కూడా మాట్లాడలేదు. దేశాన్ని పట్టిపీడిస్తున్న రుగ్మతల్లో వాళ్లకు కనిపించినవి–భూస్వామ్య విధానం, పెట్టుబడిదారి విధానం, సామ్రాజ్యవాదంలు. వీటితో పెనవేసుకుపోయిన మనువాదం, బ్రాహ్మణవాదం, కులవాదంలు. ఇవన్నీ కలిపి మనుషులను వర్గాలుగా, కులాలుగా చీల్చినాయని, పర్యావసానంగా అట్టడుగు శ్రేణుల్లోని ప్రజలకు ఇప్పటికీ రెండు పూటలా తిండి దొరకని దౌర్భాగ్య స్థితి ఉందని. ఇవన్నీ దేశానికి శత్రువులని, ఈ శత్రువుల నుంచి దేశానికి ముక్తి కావాలని అనాలంటే దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి ఆ విద్యార్థులు ఎంత తీక్షణమైన పరిశోధన చేశారోగదా! మార్పు కోసం వారు ఎంతగా తపిస్తున్నారో గదా. వారి భావ ప్రకటనా స్వేచ్ఛను పోలీసులు అడ్డుకున్నారు. ఏలికలదీ, పోలీసులదీ ఒకటే దృష్టికోణం. ప్రజాస్వామ్యమంటే ఏవగింపు. హిట్లర్‌ను కౌగిలించుకున్న గోల్వాల్‌కర్ అనుచర గణానికి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఎప్పటికి అర్థమయ్యేను?